క్లుప్తంగా

జోగి రమేష్ ఇంటి వద్ద టీడీపీ నేతల హల్‌చల్



ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి జోగి రమేష్ నివాసం వద్ద స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు హల్‌చల్ చేశారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి టీడీపీ జెండాలు కట్టుకుని ఊరేగింపుగా జోగి రమేష్ ఇంటి వద్దకు చేరుకుంది. అక్కడ టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడి కక్షపూరితంగా వ్యవహరించారు. ఇంటిముందు ఊరేగింపు ట్రాక్టర్ నిలిపి బాణాసంచా కాల్చారు. టపాసులు కాల్చి ఇంటి మీదకు విసరడంతో రెండో అంతస్తులోకి దూసుకెళ్లాయి. అక్కడున్న జోగి రమేష్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. కొందరు ఇంటిపైకి రాళ్లు విసిరి కొద్దిసేపు బీభత్సం సృష్టించారు. పోలీసులు టీడీపీ కార్యకర్తలను వారించి అక్కడి నుంచి పంపించి వేశారు.

ప్రమాదకరంగా చప్టా



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట – కోటపాడు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న సీకేపాడు ఛానల్ చప్టా కుంగి గుంత ఏర్పడింది. ఇటీవల తమ్మిలేరు వాగుకు వరద రావడంతో ఛానల్‌కి పెద్ద ఎత్తున నీరు వదిలారు. దీంతో వాహనాల రాకపోకలకు చప్టా కుంగి గుంత ఏర్పడింది. వేగంగా వచ్చే వాహనాలకు చప్టా వద్ద పడిన గుంత కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చప్టాకు మరమ్మతులు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉచితంగా పశువుల దాణా పంపిణీ



జి.కొండూరు: కవులూరులో వరద బాధిత రైతులకు బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన కామధేను ఫీడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో 200 బస్తాల దాణాను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్ బొబ్బా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదల వల్ల పశుగ్రాసాన్ని కోల్పోయి రైతులు పడుతున్న ఇబ్బందిని చూసి ఉచితంగా దాణాని పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించాలని వినతి



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ఇటీవల సంభవించిన వరదలకు మండలంలోని ముచ్చింతాల యూపీ పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరింది. మునేరు వరదలకు పాఠశాల చుట్టూ ప్రహరీ పడిపోవటంతోపాటు పాఠశాలంతా వరద నీరు పోటెత్తింది. వరద చుట్టూ పేరుకుపోయిన వరద బురద, చెత్తాచెదారం కారణంగా దుర్వాసన వెదజల్లుతుండటంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల ఆవరణలో మురుగు నిల్వలేకుండా చూడాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల చుట్టూ మురుగు నీరు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండలంలోని యూపీ పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరింది. ఇటీవలన వచ్చిన మునేరు వరదలకు పాఠశాల చుట్టూ ప్రహరీ పడి పోవటంతో పాటు పాఠశాల మొత్తం వరద నీరు పోటెత్తింది. వరద తగ్గి పాఠశాల తరగతులు జరుగుతున్నా మురుగు నీరు మాత్రం పాఠశాల చుట్టూ నిల్వ ఉంది. దీంతో దుర్వాసతో పాటు దోమలు ఉధృతి పెరిగింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జయంతిపురం(జగ్గయ్యపేట): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటలని రామ్‌కో ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ సూచించారు. గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామ్‌కో వైస్ ప్రెసిడెంట్ మూర్తిరావు, అడ్మిన్ ఫరూక్‌మహ్మద్, డీజీఎం రామకృష్ణసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

జై జై గణేశా.. బై బై గణేశా

మైలవరం: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో వినాయక చవితి సందర్భంగా పూజలు, నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మైలవరంలో వివిధ ఏరియాల్లో చలువ పందిళ్లలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు పూజలు చేసి 11వ రోజు సోమవారం నిమజ్జనానికి తరలించారు. మైలవరం వడ్డెర బజారులోని గణపతికి భక్తులు పూజలు నిర్వహించి, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలించారు.

తిరువూరు: గణపతి నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా సోమవారం తిరువూరులోని పలు కూడళ్లలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. కోలాట నృత్యాలు, డప్పులు, మేళతాళాలతో ఊరేగించారు. చీరాల సెంటర్, లక్ష్మీ సెంటర్, గణేష్ సెంటర్, రాజుపేట, బైపాస్‌రోడ్డులలోని విగ్రహాలను కట్టిలేరు, మల్లమ్మ చెరువు, పోతుల చెరువుల్లో నిమజ్జన చేశారు. రాజుపేట పాత ఏడీబీ సెంటర్లోని గణేశ విగ్రహానికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. తిరువూరు బైపాస్‌రోడ్డు లక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం రాత్రి సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణోత్సవాన్ని జరిపారు.

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. చిన్నా పెద్దా, మహిళలు స్వామివారి విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్నారు. మునుకుళ్ల, ఎర్రమాడు, పెద్దవరం, వావిలాల, కోకిలంపాడు, అక్కపాలెం, లక్ష్మీపురం, మల్లేల గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది.

నూజివీడు: పట్టణంలోని ముసలి రామ మందిరం వద్ద సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రామిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మేకా వేణు గోపాల అప్పారావు(చంటినాయన) ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలో పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు నిర్వహించారు. కోటపాడు, బూరుగుగూడెం గ్రామాల్లో వినాయక విగ్రహాలను తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో టపాసులు పేల్చుతూ ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

నూజివీడు: పట్టణంలోని ముసలి రామమందిరం వద్ద మురళీ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 29వ వినాయక నవరాత్రుల సందర్భంగా వినాయక లడ్డూకు వేలం నిర్వహించారు. విజయవాడ ఆటోనగర్‌కు చెందిన పేకేటి దుర్గారావు వేలంలో రూ.53,116లకు కైవసం చేసుకున్నాడు.

విస్సన్నపేట: స్థానిక ఎన్టీఆర్‌కాలనీ, లక్ష్మీటాకీస్ సెంటర్, చింతకుంటలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రసాదాలు పంపిణీ చేశారు.


కోటపాడులో వినాయకుడి విగ్రహానికి పూజలు


తిరువూరులో గణపతి విగ్రహాల ఊరేగింపు


నూజివీడులో అన్నదానం ప్రారంభిస్తున్న మేకా నాగ వేణుగోపాల అప్పారావు


తిరువూరు రాజుపేట ఏడీబీ సెంటర్లో..


మైలవరం వడ్డెర బజారులో గణనాథుడు


నూజివీడులో లడ్డూను దక్కించుకున్న భక్తుడు


తిరువూరు బైపాస్‌రోడ్ విఘ్నేశ్వరాలయంలో..

సీపీఎం కార్యదర్శిగా బాషా



ఆగిరిపల్లి: సీపీఎం ఆగిరిపల్లి నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు, మండల కార్యదర్శి శివనాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఆగిరిపల్లి సీపీఎం గ్రామ కార్యదర్శిగా జహంగీర్ బాషాను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా నైనవరపు ఉల్లికయ్య, సభ్యులుగా రాజారావు, కోటేశ్వరరావు, గోపాలరావును ఎన్నియ్యారు. సమావేశంలో రాజు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పంట నష్టం అంచనాలు తయారు చేసి రైతులకు నష్ట పరిహారం అందించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని సమావేశంలో తీర్మానించారు.

కార్మిక సంఘ ఆవిర్భావ దినోత్సవం

తిరువూరు: ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం తిరువూరు ఆర్టీసీ డిపోలో నిర్వహించారు. యూనియన్ జోనల్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. కార్మిక సంక్షేమానికి తమ యూనియన్ చేస్తున్న కృషిని ఆయన వివరించారు. సంఘ నాయకులు శ్రీనివాస్, కేవీ రావు, శంకరరావు, సంజీవరావు, రవి, భద్రం తదితరులు పాల్గొన్నారు.

పీఎం ప్రసంగం వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

జగ్గయ్యపేట అర్బన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో పీఎం అవాజ్ యోజన అర్బన్ 2.0 ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు సోమవారం తెలిపారు. పీఎం ప్రసంగాన్ని ప్రజలు తిలకించేందుకు స్థానిక ఉక్కు కళావేదికలో ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), చైర్మన్ ఆర్.రాఘవేంద్ర హాజరవుతారని కమిషనర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక షాబూఖారీ మసీదులో మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రజా సర్వమానవాళి కోసం ప్రత్యేక ప్రార్థన చేశారు. పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ముజావర్ల వీధిలోని గాలీబ్ సాహిద్ ఆస్థానంలో మహ్మద్ ప్రవక్త చిహ్నం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేతనకొండలో మతగురువు షేక్ రహ్మతుల్లా ప్రత్యేక ప్రార్థన జరిపారు. జెండా ఊరేగింపు నిర్వహించారు.

మైలవరం: మైలవరంలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచంలో శాంతి పూర్వక మానవ సమాజాన్ని నెలకొల్పేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన కారణజన్ముడు మహ్మద్ ప్రవక్త అని మత పెద్దలు కొనియాడారు. మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింల శాంతి ప్రదర్శన

తిరువూరు: మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా సోమవారం తిరువూరులో ముస్లింలు శాంతి ప్రదర్శన జరిపారు. జామియా మసీదులో జరిగిన మిలాద్ ఉన్ నబీ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలలో మహ్మద్ ప్రవక్త బోధనలను మౌల్వీ రజ్వీ వివరించారు. శాంతి, సహనం, సౌభ్రాతృత్వాన్ని ప్రవక్త బోధించినందున ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ప్రధాన వీధుల్లో జరిగిన ప్రదర్శనలో ముస్లిం పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తిరువూరులో ముస్లింల శాంతి ప్రదర్శన


కొండపల్లిలో ప్రార్థన చేస్తున్న మతగురువు అల్తాఫ్‌రజా, ముస్లింలు

కార్మికుడికి ఆర్థిక చేయూత అందించాలి

ఇబ్రహీంపట్నం: వరద ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ విషపురుగు కాటుకు గురైన కొండపల్లి మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికుడు చదల శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం అందించి ఆర్థిక చేయూత అందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రభుత్వ వైద్యశాల నుంచి గుంటూరు వైద్యశాలకు మెరుగైనవైద్యం కోసం తరలించిన శ్రీనివాస్‌ను సోమవారం సీఐటీయూ నాయకులు పరామర్శించారు. ఈనెల 11న ఫెర్రీలో వరద నీటిలో చెత్తను తొలగిస్తున్న సమయంలో విషపురుగు కాటుతో గాయమైన చేతికి వైరస్ సోకడంతో చేతిని తీసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని వార్డు కౌన్సిలర్‌లు, దాతలు స్పందించి ఆదుకోవాలని కోరారు. శ్రీనివాస్ ఎకౌంట్ నంబర్ 36302515229, ఎస్ బీఐ, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0001881 నంబర్‌కు సహాయం చేయాలని అభ్యర్థించారు. మున్సిపాల్టీ కార్మిక యూనియన్ నేతలు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న సీఐటీయూ అనుబంధ యూనియన్ నాయకులు

బీజేపీతో చెలిమి చేసే పార్టీలకు అధోగతే

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ

తిరువూరు: బీజేపీతో చేతులు కలిపిన ప్రాంతీయ పార్టీలు బతికి బట్టకట్టం కష్టమని, రాష్ట్రంలో టీడీపీ, జనసేనలకు అదే పరిస్థితి రాబోతోందని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో పట్టణ పార్టీ మహాసభల సందర్భంగా సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేసే బీజేపీ ప్రభుత్వంతో అంటకాగుతున్న టీడీపీ, జనసేనలు ప్రజావ్యతిరేకత ఎదుర్కోక తప్పదన్నారు. కార్మిక సంక్షేమాన్ని విస్మరించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడంలో బీజేపీ అత్యుత్సాహం చూపుతుంటే టీడీపీ, జనసేనలు అడ్డుకోకపోవడం గమనార్హమన్నారు. ఇటీవల మరణించిన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి చిత్రపటానికి కృష్ణ పలువురు నాయకులు నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, మేకల నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని పలు శాఖా కార్యదర్శులను ఎన్నుకున్నారు.



సీపీఎం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీవీ కృష్ణ

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


మైలవరంలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ సతీష్‌బాబు, డాక్టర్ ఇందిర


ఇబ్రహీంపట్నంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీనియర్ న్యాయవాది అరుణాదేవి, విజయలక్ష్మి

మైలవరం: మైలవరంలోని ఎస్ఎస్ బ్యాడ్మింటన్ నిర్వాహకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యదర్శి చనమోలు నాగభూషణం సహకారంతో స్థానిక తేజశ్విని హాస్పిటల్ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేసినట్లు ఆసుపత్రి వైద్యులు సతీష్ బాబు తెలిపారు. డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: విజయవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది అరుణాదేవి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 16వ వార్డు వరద బాధితులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. 16వ వార్డు కౌన్సిలర్, న్యాయవాదులు ధరణికోట విజయలక్ష్మి, శ్రీనివాసరావు దంపతుల కోరిక మేరకు బాధితులకు తన వంతు సహాయంగా దుప్పట్లు అందించినట్లు అరుణాదేవి తెలిపారు. వరద ప్రభావంతో సర్వం కోల్పోయిన బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని ఆమె సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు



కంచికచర్ల : రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటనలు సోమవారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం మేరకు..కంచికచర్లకు చెందిన ఉప్పుతల తిరుపతిరావు ఇబ్రహీంపట్నంలో విధులు ముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా, పరిటాల సమీపంలోకి వెనుక నుంచి గుర్తుతెలియనివాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా దొనబండ రాతి క్వారీలో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన గౌడ్ అనే వ్యక్తి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనల్లో తీవ్రంగా గాయపడిన వారిద్దరిని 108 సిబ్బంది విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిరావుకు తీవ్రగాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గౌడ్ ప్రమాద ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా హిందీ దినోత్సవం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను హిందీ ఐకమత్యంగా ముందుకు నడిపి బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో దోహద పడిందని హిందీ ప్రచారకులు పాట్నూరి దేవరాజ్‌కుమార్ అన్నారు. చిట్టినగర్ పరిధిలోని పలు పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చిట్టినగర్‌లోని సాయి అరుణా హైస్కూల్, లంబాడీపేటలోని శ్రీ సన్ ఫ్లవర్ ఇంగ్లిషు మీడియం, ఆర్ఆర్ వీధిలోని హార్పర్స్ హైస్కూల్‌లో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజ్‌కుమార్ మాట్లాడుతూ.. హిందీ మన జాతీయ భాష అని, ఆనాడు స్వాతంత్ర ఉద్యమంలో హిందీ భాష దేశప్రజలందరిని ఐకమత్యంగా ముందుకు నడిపిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధి కోసం దోహదపడుతున్న హార్పర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు స్టీఫెన్ హార్పర్, రోజ్ హార్పర్‌లను, దేవరాజ్‌కుమార్‌లతో పాటు పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో అరుణా కాన్వెంట్ ప్రిన్సిపాల్ గుజ్జారి అప్పారావు, ఆర్.రమేష్, ఆర్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడపాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడపాలని, వారంలో ఒక రోజు డ్రైడేని అమలు చేయాలని మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి, పి.దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం రాష్ట్రంలో అమలు కానున్న నూతన మద్యం పాలసీ విధానంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం లక్ష్యం ఏమిటో బహిర్గతం చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం పాలసీలపై అధ్యయనం చేసిన బృందాల నివేదికను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, ప్రముఖుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అక్రమ విక్రయాలు సాగుతున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. మద్యం పాలసీని నియంత్రణ దిశగా, నేరాలు అరికట్టే విధంగా, ప్రభుత్వమే విక్రయాలు, షాపులు తగ్గించడం లక్ష్యంగా విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గుడి, బడి, బస్టాండ్‌లు తదితర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న దుకాణాలను రద్దుచేయాలని కోరారు. బెల్ట్ షాపుల అమ్మకాలు నిరోధించాలని, ప్రతి పీహెచ్‌సీలో డీ ఎడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, అధికార యంత్రాంగాన్ని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను మద్య నియంత్రణ లక్ష్యంగా పనిచేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు సుంకర పద్మశ్రీ, పి.పద్మ, ఎన్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు తప్పని తిప్పలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ప్రభావం తగ్గినప్పటికీ వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. వరద నీటిలో మునిగిన ద్విచక్రవాహనాలు స్టార్ట్ కావడం లేదు. దీంతో ద్విచక్రవాహనాలు లేక ఆటోలకు అధిక ఛార్జీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. వరదతో సర్వం కోల్పోయిన బాధితులు ఇప్పుడు ద్విచక్రవాహనాల మరమ్మతులకు రూ. 2వేలు నుంచి రూ. 5వేలకు పైగా ఖర్చవుతోందని వాపోతున్నారు. స్కూటర్ మెకానిక్‌ల వద్దకు భారీగా వాహనాలు రావడంతో మరమ్మతుల కోసం వారం రోజులు పడుతోందని చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని యధాతథంగా కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు నెమ్మదిగా ప్రభుత్వ విద్యావ్యవస్థను కాటువేయడానికి పడగ విప్పుతున్నాడన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర జరుగుతోందన్నారు. సీబీఎస్ఈ సిలబస్ ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. ముఖ్యంగా పేద పిల్లల తల్లిదండ్రులు సీబీఎస్ఈ కొనసాగించాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలేనన్నారు. వారికి విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యం చేస్తోందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ యథావిధిగా కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.